క్లుప్తంగా

శాకాంబరిగా పారమ్మతల్లి



శాకాంబరిగా దర్శనమిస్తున్న పారమ్మతల్లి

సాలూరు: పాచిపెంట మండలంలోని చీపురు వలస సమీపంలో పారమ్మకొండ వద్ద గల పారమ్మతల్లి మంగళవారం శాకాంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాస దశమి సందర్భంగా అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థి దశలోనే నాయకత్వం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి గంగరాజు

సాలూరు: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి గంగరాజు అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెర్మని కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిత్తశుద్ధి,అంకిత భావం, నిబద్ధత తదితర లక్షణాలు నాయకుడికి ఉండాలని వివరించారు. లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ,ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొంకి వీధిలో వెలసిన అమ్మవారు



పూజలందుకుంటున్న కొంకివీధిలో వెలసిన అమ్మవారు

సాలూరు: పట్టణంలోని కొంకివీధిలో దుర్గమ్మ వెలసింది. వీధిలో దుర్గమ్మను కొలుస్తున్న ఓ కుటుంబానికి కలలో అమ్మవారు వచ్చి నేను కొంకి వీధి సమీపంలో ఓ ప్రాంతం వద్ద వెలిశానని చెప్పింది. ఈ మేరకు అమ్మవారు చెప్పిన ప్రాంతానికి వెళ్లి తుప్పలను తొలగించగా అక్కడ అమ్మవారి ప్రతిరూపం కనిపించింది. దీంతో భక్తులు తండోపతండాలుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

క్షతగాత్రులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ రాము, శంకరరావు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వ కార్మిక సంక్షేమ నిధి ద్వారా ప్రమాదాల్లో గాయాల పాలైన భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జి వెంకటరమణ కోరారు. ఈ మేరకు మంగళవారం బుడ్డిపేట గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు ఒమ్మి చిన్న, ఎస్ కృష్ణ పెదభోగిలిలో ప్రమాదవశాత్తు పరంజీపై నుంచి ఇటీవల పడిపోయి గాయాల పాలవడంతో వారిని సీఐటీయూ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల నాయకులు శంకరరావు, అప్పారావు, రమేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

స్వర్ణాలంకరణలో జగన్నాథుడు



పూజలందుకుంటున్న స్వామివారు

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లోని సత్యసాయి శివం మందిరంలో ఏర్పాటుచేసిన జగన్నాథస్వామి మంగళవారం స్వర్ణాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత తొమ్మిది రోజులుగా జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.

పారిశుద్ధ్య పక్షోత్సవాలు ప్రారంభం

- అవగాహన కల్పించిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సీతానగరం: పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో పాల్గొన్న డ్వామా పీడీ రామచంద్రరావు

పార్వతీపురంటౌన్/ పార్వతీపురం: జిల్లాలో పారిశుద్ధ్య పక్షోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పార్వతీపురం మండలంలోని వైకేఎం కాలనీలో పారిశుద్ధ్య పక్షోత్సవాలను ప్రారంభించారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కునే విధానాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేసి దానికి సంబంధించిన పోస్టర్‌ను లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పారిశుద్ధ్యం పాటించాలని హితవు పలికారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమం దోహదం చేస్తుందని, మహిళలు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని చెప్పారు. పారిశుద్ధ్య పక్షోత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చే నెల రెండవ తేదీ వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ, వైద్యారోగ్యం, మునిసిపాలిటీ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రారంభించిన పారిశుద్ధ్య పక్షోత్సవాలను స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు విజయవంతం చేయాలని డ్వామా పీడీ, మండలప్రత్యేక అధికారి కె.రామచంద్రరావు పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య పక్షోత్సవాల కార్యక్రమాల్లో పెదభోగిలి సచివాయలం నుంచి మార్కెట్ మీదుగా ఎంపీడీఓ కార్యాలయం వరకూ పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో బి.శ్రీరాములు నాయుడు, ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, వైద్యాధికారి పావని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, వెలుగు ఏపీఎం శ్రీరాములు, ఉపాధిహామీ పథకం ఏపీఓ భాను, స్థానిక సర్పంచ్ జె. తేరేజమ్మ, ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్, పంచాయతీ ఈఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: చేతులు కడుక్కోడంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



పాచిపెంట: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పక్షోత్సవ కార్యక్రమం



సీతానగరం: పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో పాల్గొన్న డ్వామా పీడీ రామచంద్రరావు



బలిజిపేట: పారిశుద్ధ్య పక్షోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ



సాలూరు రూరల్: మండల కార్యాలయం వద్ద పారిశుద్ధ్య పక్షోత్సవ కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

చెరకు తరలించడానికి అదనంగా 7 తూనిక కేంద్రాలు

- ఈఐడీ ప్యారీస్ జోనల్ మేనేజర్ మురళి

సీతానగరం: చెరకు క్రషింగ్ సీజన్ సమీపిస్తుండడంతో రైతులు పండించిన చెరకు తరలింపును వేగవంతంచేయడానికి చర్యలు చేపట్టినట్లు ఈఐడీప్యారీస్(ఐ) లిమిటెడ్ సంకిలి జోనల్ మేనేజర్ మురళి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని నిడగల్లు, బూర్జ, కామందొరవలస, లక్ష్మీపురం గ్రామాల్లో రైతులు పండించే చెరకు పంటను పరిశీలించి చెరకు తూనిక కేంద్రాల ఏర్పాటుపై సిబ్బందితో సమాలోచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో రైతు నాయకులతో చెరకు సాగు, తరలింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి జోన్ పరిధిలో ఇప్పటికి బూర్జ, లక్ష్మీపురం, చిత్రకోటబొడ్డవలస, ఏగోటివలస, కారాడ, ఎస్. రంగరాయపురం, బాడంగి గ్రామాల్లో తూనిక యంత్రాలు పని చేస్తున్నాయని తెలియజేశారు. కొత్తగా అలజంగి, పినపెంకి, వాడాడ, కృష్ణారాయపురం, కామందొరవలస, నిడగల్లు, నందబలగ గ్రామాల సమీపంలో తూనిక కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.



మాట్లాడుతున్న ఈఐడీ ప్యారీస్(ఐ)ఎల్‌టీడీ జోనల్ మేనేజర్ మురళి

చెరకు రాయితీలు ఇప్పటికే మొక్క చెరకు టన్నుకు రూ.4వేలు, మమ్ము చెరకు సాగు చేస్తున్న రైతులకు టన్నుకు రూ.2 వేలు వంతున ప్రోత్సాహక నగదును వారి బ్యాంక్ ఖాతాలకు కొంతమందికి జమ చేశామని తెలిపారు. మిగిలిన రైతులందరికీ 10 రోజుల్లోగా నగదు ప్రోత్సాహకాలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నామన్నారు. కార్యక్రమంలో రైతునాయకులు బి శ్రీరాములునాయుడు, ఎస్.హరిగోపాలరావు, అరవింద్‌కుమార్, ఎస్. శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, బొబ్బిలి, సీతానగరం ఫీల్డ్‌మెన్ పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా కార్యక్రమం



స్టాప్ డయేరియా కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: పట్టణంలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలివరకు అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలని సూచించారు. వేడి నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఓఎస్ వీర నాయుడు, హెల్త్ అసిస్టెంట్ రామారావు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలి

బొబ్బిలి రూరల్: కుష్టు వ్యాధిపై సరైన అవగాహన లేక ఎంతో మంది ఈ వ్యాధిబారిన పడుతున్నారని, వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. పిరిడి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేపట్టాలని సూచించారు. ఎవరైనా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నట్లయితే వారిని ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి పూర్తిస్థాయి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్స మొదలు పెట్టాలని సూచించారు. వ్యాధి లక్షణాలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీ, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

తెర్లాం: మండలంలోని పలు ఇసుక రీచ్‌ల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడవద్దని బొబ్బిలి ఆర్డీఓ సాయిశ్రీ అధికారులను ఆదేశించారు. మండలంలోని కుసుమూరు వేగావతి నది వద్ద ఉన్న ఇసుకరీచ్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ప్రస్తుతం ఇసుకరీచ్‌లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా, లేదా అని తహసీల్దార్ రాజ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు ఆర్డీఓ ఆదేశించారు. రాత్రి వేళల్లో నాటుబళ్లపై ఇసుకను తరలించే వారిపై నిఘా పెట్టాలన్నారు. మండలంలోని కుసుమూరు, నందబలగ ఇసుకరీచ్‌ల్లో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరగడం లేదని, అక్రమంగా ఇసుక తరలించే వారిపై దృష్టి సారించాలని తెలిపారు.

ఇసుకరీచ్‌ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిపోకుండా ఉండేందుకు గ్రామస్థాయి అధికారులతో పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ రాజ్యలక్ష్మి, హెచ్‌డీటీ భాస్కరరావు, వీఆర్‌ఓలు ఉన్నారు.

నోడల్ ఆఫీసర్‌గా సుమబాల

రాజాం: రాజాం మున్సిపాలీటీతో పాటు రాజాం మండలానికి నోడల్ ఆఫీసర్‌గా కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమబాల నియమితులయ్యారని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నోడల్ ఆఫీసర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కొత్త కార్యవర్గం

రాజాం సిటీ: స్థానిక బెరాకా బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.యేసుపాదం, ఆర్‌ఎం శ్యామ్యూల్, ఉపాధ్యక్షుడిగా ఎం.సువర్ణరాజు, జాయింట్ సెక్రటరీగా జాన్ వసంతకుమార్, కోశాధికారిగా ఆదినారాయణ, సహాయ కార్యదర్శిగా బి.రాంబాబు ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా ఎస్‌ఏ రాజు, వి.ప్రభుకుమార్, టి.ఆండ్రూస్‌తో పాటు పలువురు సభ్యులతో కొత్త కార్యవర్గం ఏర్పాటైంది.

రికార్డుల నిర్వహణ బాగుండాలి

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఆయా కేంద్రాల్లోని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్.నూకాలమ్మ కార్యకర్తలకు సూచించారు. మండలంలో అంబఖండి అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి అందుతున్న పోషకాహార వివరాలను పరిశీలించారు. పోషకాహారం సక్రమంగా అందుతుందా లేదా అని లబ్ధిదారులను ఆరాతీశారు.

పంచాయతీ నిధుల ఖర్చుపై ఆడిట్



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిటర్ ఉమాదేవి

బొబ్బిలి రూరల్: మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు వివిధ పద్దుల కింద విడుదలైన నిధుల జమా ఖర్చులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆడిట్ నిర్వహించారు. ఆడిటర్ కె.ఉమాదేవి నిధుల ఖర్చు, పెండింగ్ బిల్లుల వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సాధారణ, 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

మడ్డువలస సాగునీటి సరఫరా పెంపు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటి విడుదలను మంగళవారం పెంపుదల చేశారు. ఈ నెల 14 నుంచి 100 క్యూసెక్కుల సాగునీరు కాలువ ద్వారా విడిచిపెడుతున్నామని, ప్రస్తుతం దాన్ని 200 క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ నితిన్ తెలిపారు. ఆయకట్టు రైతుల అవసరాల మేరకు మరిన్ని క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



కుడికాలువ ద్వారా విడుదల చేస్తున్న నీరు

బకాయి వేతనాలు చెల్లించాలి

పార్వతీపురం: పురపాలక సంఘం పరిధిలోని క్లాప్ వాహన డ్రైవర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణతో పాటు డ్రైవర్లు మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మాట్లాడుతూ మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్లకు 2023వ సంవత్సరంలో రెండు నెలలు, అలాగే 2024 మే నెలతో కలిపి ఇప్పటికీ మూడు నెలలు జీతం బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. వేతనాలు అందక వారి కుటుంబ పోషణ భారంగా తయారైందని వాపోయారు. జీఓ ప్రకారం జీతం రూ.18,500లు ఇవ్వాలి. కానీ ప్రతీనెల రూ.10,,670, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ కలిపి రూ.1440లు చెల్లిస్తున్నారని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐలు కూడా బకాయి లేకుండా చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో క్లాప్ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం డీఆర్‌ఓ జి.కేశవ నాయుడుకు వినతిపత్రం అందజేశారు.



డీఆర్‌ఓ కేశవనాయుడికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, క్లాప్ వాహన డ్రైవర్లు

లక్ష్య సాధన దిశగా యువత కృషి చేయాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక చర్చివీధిలో గల గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో మాట్లాడారు. ఎంతవరకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నవి, ఏ పోటీ పరీక్షకు ఏ విధంగా సాధన చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. గ్రూప్-1తో పాటు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నామని విద్యార్థులు కలెక్టర్‌కు తెలపగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతీ, యువకులు నిరంతర కఠోర సాధన, ఏకాగ్రతతో ఎంచుకున్న లక్ష్య సాధన దిశగా కృషిచేసి ఉత్తమ ఫలితాలను పొందాలని పిలుపునిచ్చారు. ఆత్మన్యూనతను విడనాడి విషయ అన్వేషణను అలవరుచుకోవాలని, క్రమశిక్షణతో కూడిన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ లైబ్రేరియన్ దుర్గాప్రసాద్, యువతీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



లైబ్రరీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్

గొర్రెలు మేకల పెంపకం దారులు సమస్యలు పరిష్కరించాలి

సాలూరు: గొర్రెలు మేకల పెంపకం దారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైజాగ్ జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్ కోరారు. ఈ మేరకు మంగళవారం సాలూరు పట్టణంలోని ఎన్జీఓ హోమ్ వద్ద నిర్వహించిన గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గొర్రెలు,మేకలు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని, నట్టల నివారణ మందులు, అవసరమైన వ్యాక్సిన్‌లు ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు. గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఉపాధిహామీ ద్వారా షెడ్‌ల నిర్మాణానికి ఇస్తున్న 70 శాతం సబ్సిడీని 90 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్‌సీడీసీ రుణాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకుడు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ, గొర్రెలు, మేకలకు ఉచిత ఇన్సూరెన్స్ కల్పించాలని, మృతి చెందిన జీవానికి రూ.6 వేల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నాయకులు రండి అచ్యుతరావు, అల్లురామకృష్ణ, తిరుపతి, వెంకటరమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొనసాగిన రిలే నిరాహారదీక్షలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని శివ్వాం గ్రామ దళితులను దూషించి దాడి చేసిన పెత్తందారులపై అట్రాసిటి చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదల భూముల సమస్యలు పరిష్కరించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాము మాట్లాడుతూ దళితులపై దాడి జరిగి 20 రోజులు అవుతున్నా ప్రభుత్వం, అధికారులు, పోలీసులు, పెత్తందారులను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. వారి భూమిని వారికి అప్పజెప్పి, జిల్లాలో భూములు ఆక్రమించిన వారిపైన చర్యలు తీసుకుని సాగు చేస్తున్న దళితులు, గిరిజనులు, బీసీలు, పేదలకు పట్టాలిచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారికి న్యాయం జరగని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మచ్చ పకీరమ్మ, లక్ష్మి, పాలక కళావతి, కారు లక్ష్మి, పి.రాము, శ్రీదరపు చిన్నయ్య, కొర్ర శివ, మెల్లికి రాము, తాడంగి ఉదయ్, తాడంగ బాదల్ మద్దతు ప్రకటించిన ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు అఖిల్, బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

గుమ్మలక్ష్మీపురం:

గిరిజనులంతా ఐక్యంగా ఆగష్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక వైటీసీలో మంగళవారం పలు సంఘాల గిరిజన సంఘాల నాయకులు సమావేశమై ఆదివాసీ ఉత్సవాల నిర్వహణ, కార్యచరణపై చర్చించారు.

ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ.. గిరిజనులంతా ఐక్యంగా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకునేందుకు నాయకులంతా కలసి రావాలని కోరారు. ప్రభుత్వమే ఆదివాసీ దినోత్సవం నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ఆ రోజు ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు మండంగి రమణ, కోలక అవినాష్, వెంపటాపు భారతి, మండంగి భూషణరావు, కె.మల్లేశ్వరరావు, కడ్రక కళావతి, అడ్డాకుల కృష్ణారావు తదితరులున్నారు.

‘చెత్త’ రాజకీయం

భామిని: మండలంలోని పెద్దదిమిలి దళిత వాడలో సర్పంచ్ తొగరాన శ్రీను ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను టీడీపీ కార్యకర్తలు పలువురు మంగళవారం అడ్డుకున్నారు. సర్పంచ్ శ్రీనును దుర్భాషలాడుతూ పారిశుద్ధ్య పనులు నిలుపుదల చేయాలని వీరంగం చేశారు. ఇదే టీడీపీ కార్యకర్తలు భామిని మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం వెళ్లి దళితవాడలో మురుగు నీరు తరలింపు చర్యలు చేపట్టాలని విన్నవించారు. సోమవారం ఫిర్యాదు చేసిన వారే మంగళవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులు నిలుపుదల చేయాలని అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని సర్పంచ్ శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో రాజకీయాలు అవసరమా అని ఆయన ప్రశ్నించారు.



పూడిక తీత పనులను అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు